సాక్షి
తూర్పుగోదావరి
సోమవారం । 8 । జులై । 2024



కంఠహారం సమర్పణ

కొత్తపల్లి: పిఠాపురం పురుహూతిక అమ్మవారికి కంది సూర్యచంద్రరావు (విశాఖపట్నం మధురవాడ) రూ.4.50 లక్షల విలువైన 55.460 గ్రాముల బంగారు కంఠహారం సమర్పించారు.



రూ.లక్ష విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఇందుకూరి శ్రీనివాసరాజు కుటుంబ సభ్యులు (కేశనకుర్రుపాలెం) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

ఉచితమిస్తారా.. ఊడ్చేస్తారా!



ప్రభుత్వం సోమవారం నుంచి ఉచిత ఇసుక విధానం అమలు చేయనుంది. 2014-19లో పారదర్శకం పేరు చెప్పి చంద్రబాబు ప్రభుత్వం ఉచిత ఇసుక అంటూ ఉన్నదంతా మింగేసింది. మళ్లీ ఇప్పుడు చరిత్ర రిపీట్ చేసేందుకు ప్రణాళిక రచించిందని చెప్పకనే అర్థమవుతోంది. - 8లో ▸

చెరగని సంతకం.. చెదరని జ్ఞాపకం



- జిల్లా సమగ్రాభివృద్ధికి వైఎస్సార్ కృషి
- ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట
- సాగునీటి ప్రాజెక్టులతో మెట్ట రైతుకు మేలు
- ఉచిత వ్యవసాయ విద్యుత్‌కు ఇక్కడే అంకురార్పణ
- ఆరోగ్యశ్రీ ద్వారా వేలాది మందికి సంపూర్ణ ఆరోగ్యం
- ప్రజల హృదయాల్లో ఆయన స్థానం నేటికీ పదిలం
- నేడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి

సాక్షి, రాజమహేంద్రవరం: కొంత మంది నాయకులు ఉంటారు. వారు వారి కోసమే పుడతారు. రాజకీయం పేరుతో.. వారి.. వారివారి.. పెత్తందార్ల ప్రయోజనాల కోసమే అహరహం పని చేస్తుంటారు. దానికి ప్రజాసేవ ముసుగు తొడిగి, అమాయక జనాన్ని మేకవన్నె పులుల్లా నమ్మించి, వంచిస్తుంటారు.

మరి కొంత మంది నేతలు ఉంటారు. వారు ప్రజల కోసమే పుడతారు. అనుక్షణం వారి బాగోగుల కోసమే పరితపిస్తుంటారు. వారికి కష్టమొస్తే కదిలిపోతారు.. కరిగిపోతారు. సాధ్యమైనంతగా సాయపడతారు. ఈ ప్రస్థానంలో అవసరమైతే తమ ప్రాణాలను సైతం లెక్క చేయరు. వారే అసలు సిసలు ప్రజానేతలు. అటువంటి వారు భౌతికంగా దూరమైనా.. తిరుగులేని తమ 'ప్రజాప్రస్థానం'తో ఎన్నాళ్లయినా.. ఎన్నేళ్లయినా జనం గుండెల్లో చెరగని ముద్ర వేసుకుంటారు. ప్రజలకు మంచి చేయాలనుకునే నవతరం నాయకులకు స్ఫూర్తిగా నిలుస్తారు.

అటువంటి మహానేత.. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. సంక్షేమ చరిత్రలో ఆయన హయాం సరికొత్త అధ్యాయం. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధిలో ఆయన పాత్ర ఎనలేనిది. వేశారు. సమస్యలతో వచ్చిన ప్రజలకు.. స్వచ్ఛమైన చిరునవ్వుతో పరిష్కారాలు చూపిస్తూ.. వారికి కొండంత అండగా నిలిచారు. అందుకే ప్రజలందరూ ఆయనను ఆప్యాయంగా 'పెద్దాయన'గా పిలుచుకునే వారు. ఆ మహనీయుని జయంతి నేడు. నాడు ముఖ్యమంత్రిగా ఆయన జిల్లా ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి ఎంతో తోడ్పాటునందించారు. జిల్లా ప్రగతి ప్రస్థానంలో ఆయనది చెరగని సంతకం. ఈ నేలపై ఆయన అడుగుజాడలు ఎప్పటికీ చెదరని జ్ఞాపకం.

రూ.800 కోట్లతో గామన్ బ్రిడ్జి నిర్మాణం



16వ నంబర్ జాతీయ రహదారిపై విజయవాడ - విశాఖపట్నం నగరాల మధ్య దూరాన్ని తగ్గించే లక్ష్యంతో నాటి సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.800 కోట్లతో గోదావరి నదిపై నాలుగు లేన్ల వంతెన (గామన్ బ్రిడ్జి) నిర్మాణం, అప్రోచ్ రోడ్డు పనులు చేపట్టారు. మొత్తం 14 కిలోమీటర్ల మేర వీటి నిర్మాణాలు జరగగా.. 4.5 కిలోమీటర్ల పొడవున గోదావరి నదిపై వంతెన నిర్మించారు. 2008లో పనులు ప్రారంభించారు. దీని నిర్మాణంతో విశాఖ - విజయవాడ మధ్య దూరం 40 కిలోమీటర్ల మేర తగ్గింది.

- ప్రతి జిల్లాకు ఒక యూనివర్సిటీ ఉండాలనే లక్ష్యంతో రాజానగరం సమీపాన ఆదికవి నన్నయ యూనివర్సిటీని ఏర్పాటు చేశారు.

ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం



వైఎస్సార్ హయాంలో పూర్తి చేసిన తాడిపూడి ఎత్తిపోతల పథకం

- వైఎస్సార్ రైతు బాంధవుడిగా ఖ్యాతి గడించారు. అన్నదాతలకు పావలా వడ్డీకే రుణాలు, రుణమాఫీతో వెన్నుదన్నుగా నిలిచారు.
- బ్రాహ్మణగూడెంలో రూ.2.73 కోట్లతో 1,200 ఎకరాలకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకం నిర్మించారు. తద్వారా 600 ఎకరాల్లో ముంపు సమస్యకు పరిష్కారం చూపారు.
- తాళ్లపూడి మండలంలో 4,950 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.8.59 కోట్లతో పైడిమెట్ల ఎత్తిపోతల పథకం నిర్మించారు.
- చాగల్లులో రూ.3.60 కోట్లతో మరో ఎత్తిపోతల పథకం నిర్మించారు.
- తాళ్లపూడి మండలంలో సుమారు రూ.500 కోట్లు వెచ్చించి తాడిపూడి ఎత్తిపోతల పథకం నిర్మించారు. పదహారు మండలాల్లో 2,06,600 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో దీనిని నిర్మించారు.
- కొవ్వాడ కాలువ వరద ముంపు నివారణకు రూ.56 కోట్లతో అవుట్‌ఫాల్ స్లూయిజ్ నిర్మించారు. దీంతో కొవ్వూరు, పోలవరం, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలోని 15 వేల ఎకరాలకు వరద ముంపు సమస్య తీరింది.
- ఆంధ్రప్రదేశ్ దశ, దిశను మార్చే పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై వైఎస్సార్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. కేంద్రం నుంచి అన్ని రకాల అనుమతులు తీసుకుని వచ్చారు. కుడి, ఎడమ ప్రధాన కాలువలు తవ్వించారు.
- సీతానగరం మండలం పురుషోత్తపట్నం వద్ద గోదావరిపై పుష్కర ఎత్తిపోతల పథకం నిర్మించారు. దీని ద్వారా మన జిల్లాలోని రాజానగరం, కాకినాడ జిల్లా జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం, తునితో పాటు అనకాపల్లి జిల్లాలోని పాయకరావుపేట నియోజకవర్గాల్లోని 19 మండలాల్లో సుమారు 85,810 ఎకరాలకు సాగునీరు అందుతోంది.
- మెట్ట ప్రాంత రైతులకు మంచి చేయాలన్న తలంపుతో గోదావరి నదిపై తాడిపూడి సమీపాన చింతపూడి ఎత్తిపోతల పథకానికి వైఎస్సార్ శ్రీకారం చుట్టారు. తద్వారా కృష్ణా డెల్టా ఆయకట్టు స్థిరీకరణకు ప్రయత్నించారు.
- రూ.15.26 కోట్లతో కొవ్వూరు, తాళ్లపూడి, దేవరపల్లి మండలాల్లోని 4,950 ఎకరాలకు సాగునీరు అందించే ఆరికిరేవుల ఎత్తిపోతల పథకం కింద 90 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు.
- కుమారదేవం ఎత్తిపోతల పథకాన్ని రూ.1.75 కోట్లతో పునరుద్ధరించారు.
- రైతు బాంధవుడిగా వైఎస్సార్ ఖ్యాతి గడించారు. పావలా వడ్డీకే రుణాలు, రుణమాఫీ వంటి వినూత్న పథకాలతో అన్నదాతలకు వెన్నుదన్నుగా నిలిచారు.

వ్యవసాయానికి ఉచిత విద్యుత్



ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలిచిన ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకానికి మన జిల్లాలోనే అంకురార్పణ జరిగింది. నాటి చంద్రబాబు పాలనలో ప్రజలు పడుతున్న కష్టాలను స్వయంగా తెలుసుకునే లక్ష్యంతో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజాప్రస్థానం పాదయాత్ర నిర్వహించారు. ఆ క్రమంలో రాజానగరం ఉన్నత పాఠశాల మైదానంలో ఒక రాత్రి ఆయన బస చేశారు. ఆ సందర్భంగా కొందరు స్థానిక రైతులు ఆయనను కలిసి, సాగునీటి కోసం పడుతున్న అవస్థలను, కరెంటు బిల్లులు కట్టలేక పొలాలు, పుస్తెలు అమ్ముకుంటున్నామని ఆవేదనతో వివరించారు. వారి వెతలు విని చలించిపోయిన వైఎస్సార్.. 2004 ఎన్నికల్లో తాను అధికారంలోకి రాగానే వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించే ఫైలుపై తొలి సంతకం చేశారు. వేలాది మందికి బతుకుతెరువుగా మారిన నర్సరీలకు సైతం ఉచిత విద్యుత్ అందించిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుంది.



ప్రజాప్రస్థానం పాదయాత్ర సందర్భంగా రోడ్ కం రైల్వే బ్రిడ్జి మీదుగా జిల్లాలోకి వస్తున్న వైఎస్సార్ (ఫైల్)

అభాగ్యులకు అండ

వృద్ధాప్యంలో అనేక ఇక్కట్లు పడుతున్న అభాగ్యులకు వైఎస్ రాజశేఖరరెడ్డి అండగా నిలిచారు. 2004కు ముందు నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.75గా ఉన్న పింఛను సొమ్మును రూ.200కు పెంచారు. వికలాంగుల పింఛనును కూడా అప్పట్లో రూ.500కు పెంచిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుంది.

నిడదవోలు అభివృద్ధికి అగ్రస్థానం

రాజీవ్ నగరబాట కార్యక్రమంలో భాగంగా నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2005లో నిడదవోలు పట్టణంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ.కోటితో నిర్మించిన రోడ్లు, డ్రెయిన్లను, రూ.కోటితో ఏర్పాటు చేసిన సెంట్రల్ విద్యుత్ లైటింగ్ వ్యవస్థను, విద్యానగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన పార్కును ప్రారంభించారు. బాలాజీనగర్‌లో రూ.1.64 కోట్లతో 500 కిలోలీటర్ల మంచినీటి రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేశారు. ఇందిరమ్మ పథకంలో భాగంగా 28వ వార్డు శివారున 832 మంది లబ్ధిదారులకు ప్రతిష్టాత్మకంగా ఇళ్లు నిర్మించిన ఘనత వైఎస్సార్‌కే దక్కింది. రూ.70 లక్షలతో నూతన మునిసిపల్ కార్యాలయాన్ని నిర్మించారు. దీనికి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మున్సిపల్ కార్యాలయంగా నామకరణం చేశారు.



పాదయాత్రలో అస్వస్థతతో మధురపూడి విమానాశ్రయం సమీపాన విశ్రాంతి తీసుకున్న వైఎస్సార్

'యాత్రా'పథంలో..

మండుటెండల్లో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్వహించిన ప్రజాప్రస్థానం పాదయాత్ర నాడు రోడ్డు కం రైలు వంతెన మీదుగా రాజమహేంద్రవరం చేరింది. విపరీతమైన ఎండల్లో పాదయాత్ర సాగించడంతో ఆ సమయంలో ఆయన కొంతమూరు వద్ద అస్వస్థతకు గురయ్యారు. అక్కడే అరగంట పాటు విశ్రాంతి తీసుకుని తిరిగి యాత్ర కొనసాగించారు. అనంతరం మధురపూడి విమానాశ్రయం ఎదురుగా ఉన్న తోటలో ఆరు రోజుల పాటు వైద్య సేవలు పొందారు. ఆ సందర్భంగా ఈ ప్రాంతానికి చెందిన పలువురు నాయకులతో ముచ్చటించారు. అనంతరం వైఎస్సార్ బస్సు యాత్ర సైతం చేపట్టారు.

విస్తృతంగా సేవా కార్యక్రమాలు



దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాం స్వర్ణయుగం. ఆయన అభివృద్ధిని, సంక్షేమాన్ని పరుగులు పెట్టించారు. రైతు బాంధవుడిగా ఖ్యాతి గడించారు. మెట్ట రైతులకు అనేక ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందించిన మహనీయుడు వైఎస్సార్. ఆరోగ్యశ్రీతో ఎంతో మంది ప్రాణాలు కాపాడారు. అటువంటి మహానేత జయంతిని జిల్లావ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించనున్నారు. జక్కంపూడి ఫౌండేషన్ ఆధ్వర్యాన భారీ రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నాం.

– జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

న్యూస్‌రీల్

కడలిలోకి మిగులు జలాలు



కాటన్ బ్యారేజీ నుంచి సముద్రంలోకి విడుదలవుతున్న మిగులు జలాలు

ధవళేశ్వరం: పరీవాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి ఉధృతి స్వల్పంగా పెరిగింది. దీంతో బ్యారేజీ నుంచి 37,732 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. వరద నీరు చేరడంతో బ్యారేజీ వద్ద గోదావరి నీరు పూర్తిగా ఎరుపెక్కింది. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులకు చేరింది. ఖరీఫ్ సాగుకు సంబంధించి బ్యారేజీ నుంచి తూర్పు డెల్టాకు 3,300, మధ్య డెల్టాకు 2,100, పశ్చిమ డెల్టాకు 4 వేలు కలిపి మొత్తం 9,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యాన స్థానిక గాంధీపురంలోని శ్రీ గౌతమి స్మార్ట్ స్కూల్‌లో ఆదివారం జిల్లా స్థాయి చదరంగం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అండర్-7, అండర్-19 బాలురు, బాలికల విభాగంలో ఈ పోటీలు జరిగాయి. సుమారు 70 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. అండర్-7 విభాగంలో రియాన్, ప్రీతమ్, బాలికల విభాగంలో వేదాన్షి, శ్రీనిఖిల విజేతలుగా నిలిచారు. అండర్-19 బాలుర విభాగంలో షణ్ముఖరెడ్డి, సీతాసాగర్, సాకేత్, మోక్షిత్, బాలికల విభాగంలో కావ్యశ్రీ, రష్మి, రిషిత విజయం సాధించారు. విజేతలు అండర్-7, అండర్-19 విభాగాల్లో రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని చదరంగం సంఘం కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు.

కలెక్టర్ చెప్తే వినాలా?

- కలెక్టర్, జేసీ, మున్సిపల్ కమిషనర్ సీసీలు వెళ్లిపోవాలని ఆదేశం
- ఇప్పటికే వారి మాతృశాఖలకు కలెక్టర్, జేసీ సీసీలు
- ఆ స్థానం నుంచి కదలని మున్సిపల్ కమిషనర్ సీసీ

సాక్షి, రాజమహేంద్రవరం: క్యాంప్ క్లర్క్(సీసీ)ల అక్రమ వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ప్రజలను అధికారులకు దూరం చేయడం, అవినీతికి పాల్పడటంపై ఇటీవల 'సాక్షి'లో 'అడ్డుగోడలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్పందించిన విషయం తెలిసిందే. సీసీల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడిన ఆమె.. ఇలాంటి వాటిని సహించేది లేదని హెచ్చరించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న కలెక్టర్ సీసీలను వెంటనే మాతృశాఖకు పంపించేశారు. జాయింట్ కలెక్టర్ సీసీ సైతం సెలవులో వెళ్లిపోయారు. ఇంత వరకూ బాగానే ఉన్నా.. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ సీసీకి మాత్రం ఇప్పటికీ స్థానచలనం కలగలేదు. ఆయనను కూడా పంపించేయాలని స్వయంగా జిల్లా కలెక్టరే ఆదేశాలు జారీ చేసినా ఎందుకో కానీ నగరపాలక సంస్థ కమిషనర్ పట్టించుకున్న దాఖలాలు లేవు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సీసీతోనే ఇంకా తన పర్యటనలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయనను పక్కన పెట్టకపోవడం వెనుక మతలబు ఏమిటనే చర్చ నగర పాలక సంస్థ ఉద్యోగుల్లో విస్తృతంగా జరుగుతోంది. నగర పాలక సంస్థలో ఎక్కడ ఏం జరిగినా సదరు సీసీకి క్షణాల్లో సమాచారం చేరుతుంది. అక్రమ నిర్మాణాలైనా, ఇతర ఏ పనులైనా తానే దగ్గరుండి చూసుకుంటారనే ఆరోపణలున్నాయి. 'ఎవరో ఏదో చెబుతారు. పత్రికల్లో ఏదో రాస్తుంటారు. అంత మాత్రాన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏముంది' అని అధికారులే అంటున్నారంటూ ఉద్యోగులు విస్మయానికి గురవుతున్నారు.

పోటెత్తిన 'లోవ' భక్తులు

- 65 వేల సత్యదేవుని ప్రసాదం ప్యాకెట్ల విక్రయం
- అన్నవరం దేవస్థానానికి రూ.13 లక్షల ఆదాయం

అన్నవరం: ఆషాఢ మాసం తొలి ఆదివారం తలుపులమ్మ తల్లి దేవస్థానానికి వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణంలో సత్యదేవుని ప్రసాదాల కొనుగోలుకు పోటెత్తారు. దీంతో రికార్డు స్థాయిలో సత్యదేవుని ప్రసాదం 65 వేల ప్యాకెట్లు అమ్ముడు పోయాయి. కొండ దిగువన తొలి పావంచా, పాత నమూనా ఆలయం, నూతన నమూనా ఆలయం వద్ద విక్రయించినవి 50 వేలు కాగా, రత్నగిరిపై 15 వేల ప్యాకెట్లు విక్రయించారు. దీని ద్వారా అన్నవరం దేవస్థానానికి రూ.13 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. అన్నవరం గ్రామంలో రత్నగిరి మెట్ల మార్గంలో తొలి పావంచా వద్ద, జాతీయ రహదారిపై పాత, కొత్త నమూనా ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్లలో భక్తులు అత్యధికంగా ప్రసాదాలు కొనుగోలు చేశారు. లోవ భక్తుల తాకిడిని తట్టుకునేందుకు తొలి పావంచా వద్ద ఉన్న కౌంటర్‌కు అదనంగా మరో రెండు, పాత నమూనా ఆలయం వద్ద మరో రెండు చొప్పున అదనపు కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రసాదాలు విక్రయించారు. జాతీయ రహదారిపై రాజమహేంద్రవరం వైపు ప్రయాణించే భక్తుల కోసం గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సత్యదేవుని నూతన నమూనా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌లో ప్రసాదాల కొనుగోలుకు భక్తులు పోటీ పడ్డారు. ఇక్కడ విక్రయానికి 6,500 ప్యాకెట్లు ఉంచగా మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకూ ఐదు వేల ప్రసాదం ప్యాకెట్లు అమ్ముడు పోయాయి. నమూనా ఆలయ ప్రాంగణం భక్తుల వాహనాలతో నిండిపోయింది. శనివారం నుంచే ఇక్కడ ప్రసాదాలు విక్రయిస్తున్నారు. దీంతో చాలా మంది భక్తులకు ఈ విషయం తెలియలేదు. ఇక్కడ ప్రసాదాల విక్రయాలపై జాతీయ రహదారి మీద ప్రయాణించే భక్తులందరికీ తెలిసేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నామని ప్రసాదం విభాగం సీనియర్ అసిస్టెంట్ పి.లక్ష్మీనారాయణ తెలిపారు.

ఘనంగా సత్యదేవుని రథోత్సవ సేవ

అన్నవరం: సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి రథోత్సవ సేవ ఆదివారం ఉదయం రత్నగిరిపై ఆలయ ప్రాకారంలో కన్నుల పండువగా జరిగింది. ఉదయం పది గంటలకు రథాన్ని తూర్పు రాజగోపురం ముందుకు తీసుకువచ్చి, స్వామి, అమ్మవార్లను వేంచేయించి, అర్చకులు పూజలు చేశారు. అనంతరం భక్తులు కొబ్బరి కాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, బాజాభజంత్రీల ఘోష నడుమ పెద్ద సంఖ్యలో భక్తులు వెంట రాగా, ఆలయ ప్రాకారంలో రథంతో మూడుసార్లు ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం పునఃపూజలు నిర్వహించి స్వామి, అమ్మవార్లను మేళతాళాల మధ్య ఆలయానికి తీసుకువెళ్లారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, ముష్టి పురుషోత్తం, చిట్టి శివ ఘనపాఠి, యనమండ్ర శర్మ, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ, అర్చకుడు సుధీర్, పరిచారకులు పవన్, శివ పూజలు నిర్వహించారు. ఆలయ ఏఈ డీవీఎస్ కృష్ణారావు, సూపరింటెండెంట్ ఐవీ రామారావు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రూ.2,500 చొప్పున ముగ్గురు భక్తులు టికెట్లు కొనుగోలు చేసి రథోత్సవ సేవలో పాల్గొన్నారు. వీరికి స్వామివారి అంతరాలయ దర్శనంతో పాటు వేదాశీస్సులు అందచేశారు. స్వామివారి కండువా, జాకెట్టు ముక్క, ప్రసాదం బహూకరించారు. రథోత్సవ సేవ ద్వారా రూ.7,500 ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.



ఆలయ ప్రాకారంలో సాగుతున్న రథోత్సవం

క్లుప్తంగా

బైక్‌పై వచ్చి బంగారం చోరీ

అంబాజీపేట: ఓ మహిళ మెడలోని బంగారు సూత్రాల తాడును గుర్తు తెలియని ఇద్దరు శని వారం రాత్రి లాక్కుపోయారు. బాధితురాలి కథనం ప్రకారం.. గంగలకురు అగ్రహారం శివారు పీర్మియపాలేనికి చెందిన శీలం వెంకట లక్ష్మి తన ఇంటి ఆవరణలో అంబాజీపేట ప్రధాన రహదారి రోడ్డు పక్కన పాన్ షాపు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి 7:30 గంటల సమయంలో ఇద్దరు మోటార్ సైకిల్‌పై వచ్చి వాటర్ ప్యాకెట్లు, డ్రింక్ బాటిల్ కావాలని అడిగారు. దాంతో వెంకటలక్ష్మి డ్రింక్ బాటిల్ తీస్తున్న సమయంలో ఆమె మెడలోని బంగారు తాడును హఠాత్తుగా ఓ వ్యక్తి లాక్కున్నాడని బాధితురాలు వాపోయింది. బంగారు తాడుకు ఉన్న 14 గ్రాముల సూత్రాలను లాక్కుని వారిద్దరూ పరారయ్యారని తెలిపింది. ఈ సంఘటనపై అంబాజీపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది.

పంచాయతీ కార్యాలయంలో అగ్నిప్రమాదం



కాలిపోయిన హెల్త్ యూనిట్ పాత రికార్డులు, ఫర్నీచర్

సామర్లకోట: మాధవపట్నం పంచాయతీ కార్యాలయంలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ వివరాల ప్రకారం.. ఈ పంచాయతీ కార్యాలయంలో హెల్త్ సిబ్బంది తమ యూనిట్ పనులు నిర్వహించేవారు. కొత్తగా హెల్త్ సెంటర్ నిర్మించడంతో కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్పు చేశారు. అయితే హెల్త్ యూనిట్‌కు సంబంధించిన పాత రికార్డులు పంచాయతీ కార్యాలయంలోని ఒక గదిలో భద్రపరిచామని పంచాయతీ కార్యదర్శి వై.శ్రీహరి తెలిపారు. ఆదివారం హెల్త్ యూనిట్ గది నుంచి మంటలు రావడంతో స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. కాకినాడకు చెందిన అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా ప్రదేశానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ఘటనలో ఫర్నీచర్, రికార్డులు కాలిపోయాయి. అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉందని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. వీఆర్వో వెంకటేశ్వరి ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కాకినాడ రూరల్: కాకినాడ బొందగుంట వద్ద ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయిస్ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు అర్బన్ ఎంఎస్ఓ ఆనంద్, ఆర్ఐ రాజు, వీఆర్వోలు కలసి బొందగుంటలో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఓ ఇంట్లో 37 బస్తాలు (1.85 టన్నులు) రేషన్ బియ్యం గుర్తించారు. ఈ మేరకు నిందితుడు కందా సత్యనారాయణపై కేసు నమోదు చేశారు.

ఉచితమిస్తారా.. ఊడ్చేస్తారా!

- అనుమంతైనా జంకకుండా అక్రమాలు
- ఉచిత ఇసుక విధానంపై అనుమానాలు
- గత టీడీపీ హయాంలో వక్కదారి
- నేటి నుంచి మళ్లీ అదే బాటలోకేనా?



గుటుక్కున మింగేయాలని: గత నెల 13న కపిలేశ్వరపురంలో ఈ ఇసుకనే తరలించేందుకు సిద్ధమయ్యారు



2015లో కోరుమిల్లి ర్యాంపు వద్ద నిరసన తెలుపుతున్న డ్వాక్రా మహిళలను అడ్డగిస్తున్న పోలీసులు (ఫైల్)

కపిలేశ్వరపురం: గత అనుభవాలు ఎన్నో పాఠాలు నేర్పుతాయి.. అవే మనకు హితబోధ చేస్తాయి.. ప్రస్తుత పాలకుల తీరును గత పాలనా అనుభవాలతో పోల్చవచ్చు. 2014–19లో ప్రజలిచ్చిన అధికారంతో పారదర్శకత పేరు చెప్పి చంద్రబాబు ప్రభుత్వం ఉచిత ఇసుక అంటూ ఉన్నదంతా మింగేసింది. మళ్లీ ఇప్పుడు చరిత్ర రిపీట్ చేసేందుకు ప్రణాళిక రచించిందని చెప్పకనే అర్థమవుతోంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నెల రోజుల లోపే గుట్టలుగా వేసిన ఇసుకను గుట్టుగా అక్కడక్కడా తరలించేసింది. ఇప్పుడేమో ఉచితమంటూ ఊడ్చేయడానికి సిద్ధమవుతోంది. సోమవారం నుంచి అమలు చేయనున్న ఉచిత ఇసుక పంపిణీ విధానం ఎలా సాగుతుందో వేరే చెప్పాలా..!

అప్పుడూ.. ఇప్పుడూ..

2019కి ముందు టీడీపీ హయాంలో ఉచిత ఇసుక పంపిణీ విధానాన్ని తిరిగి అమలు చేయాలని ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దానికి అనుగుణంగా ఈ నెల 3న రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, సంబంధిత అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష జరిపారు. 8వ తేదీ సోమవారం నుంచి ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల్లోని కలెక్టర్లు ఇప్పటికే సంబంధిత అధికారులకు ఉచిత ఇసుక విధి విధానాలపై సూచనలు చేశారు. కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం, రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు మండలాల్లోని ఏడు ఇసుక నిల్వల కేంద్రాల్లోని ఇసుకను ఉచితంగా పంపిణీ చేసేందుకు సమాయత్తం కావాలని ఇక్కడి కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. అలాగే తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆ జిల్లా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎన్నికల హామీని చంద్రబాబు నిలబెట్టుకున్నట్టు ప్రభుత్వ అనుకూల మీడియా ప్రచారం సాగిస్తోంది. దీనివల్ల ప్రజలకు ఇసుక ఉచితంగా లభ్యమవుతుందని, నిర్మాణ రంగం బలోపేతం అవుతుందని, స్థానిక సంస్థలకు ఆదాయం సమకూరుతుందని చెబుతోంది. తొలుత ఉన్న ఇసుక నిల్వల పంపిణీకి నిర్ణయించింది. తర్వాత ర్యాంపులను తెరిచి ఇసుకను తవ్వి, నిల్వ కేంద్రాలకు తరలించనుంది. అందుకు అయ్యే ఖర్చును మాత్రమే వినియోగదారుల నుంచి వసూలు చేస్తామన్న చెబుతోంది. ఇవన్నీ పైపై మెరుగులు మాత్రమే. ఉచిత విధానం వెనుక పైస్థాయి నుంచి క్షేత్ర స్థాయిలోని కూటమి నేతల ప్రయోజనాలు దాగి ఉన్నాయని కొందరు అంటున్నారు. అందుకు 2019కు ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఘటనలే నిదర్శనం.

గతం.. అదే సాక్ష్యం

ఉచిత ఇసుక పంపిణీ విధానాన్ని 2014–19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేసింది. అప్పట్లో రాష్ట్రంలో మరీ ముఖ్యంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అక్రమాలకు అడ్డు లేకుండా పోయింది. జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న జొన్నాడ, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, తాతపూడి తదితర ర్యాంపుల నుంచి ఇసుక అక్రమాలు జోరుగా జరిగాయి. అప్పట్లో ఓ ప్రభుత్వ నేత, సినీనటుడు బంధువులు కె.గంగవరం మండలంలో ఉన్నారు. వారికి కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి, కపిలేశ్వరపురం గ్రామాల మధ్యలో భూములున్నాయి. ఇందులో 16.16 ఎకరాల జిరాయితీ భూమిలో పేరుకుపోయిన 1,50,419 క్యూబిక్ మీటర్ల ఇసుక మేటలను తరలించుకుంటామంటూ అనుమతులు తెచ్చుకుని, గోదావరి నదీ గర్భంలోని ఇసుకను 2017 జూలై నుంచి కొద్ది నెలల పాటు అక్రమంగా తరలించారు. దీనిపై అప్పట్లో ఆందోళనలూ జరిగాయి.

లెక్కల్లో కొన్ని.. అక్రమాలు ఇంకొన్ని

గత టీడీపీ హయాంలో ఇసుక తవ్వకాల తీరు అక్రమాలకు నెలవైంది. జూన్, జులై, ఆగస్టు నెలల్లో వరద గోదావరి నదిలో తవ్వకాలు సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో జూన్‌కు ముందు వరదల సమయంలో వినియోగార్థం ఇసుకను నిల్వ చేసేవారు. వరదలకు ఇసుక డిమాండ్ ఎక్కువ ఉండటంతో అక్రమార్కులు నిల్వలను అధిక ధరలకు విక్రయించేవారు. తహసీల్దార్, మైన్స్ అధికారుల పర్యవేక్షణ నామమాత్రంగా ఉండేది. లెక్కల్లో కొన్ని వాహనాలను మాత్రమే చూపించి, అధిక సంఖ్యలో లోడ్లు అక్రమంగా తరలించేవారు. దీనిపై అనేక సార్లు ప్రజలు, ప్రజా సంఘాలు ఆందోళనలు చేసిన ఘటనలున్నాయి. గోదావరి వరద తగ్గాక జియో కార్డినెన్స్ నిబంధనలను మీరి నదీ గర్భంలోకి బాటలు వేసి ఇసుకను తరలించేవారు. ప్రస్తుత ఉచిత ఇసుక తరలింపు విధానంలో కూడా అలాగే జరుగుతుందా అనే అనుమానాలు వెంటాడుతున్నాయి.

అధికారంలోకి వచ్చిన నెలలోపే..

అధికారంలోకి వచ్చి నెల రోజులు గడవక ముందే కూటమి ప్రభుత్వం ఇసుక అక్రమాలకు తెరలేపింది. ఇంకా ఉచిత ఇసుక విధి విధానాలను ప్రకటించక ముందే ర్యాంపుల్లోకి బాటలు వేసి రాత్రిళ్లు ఇసుక తరలింపునకు పాల్పడ్డారు. గత నెల 13న రాత్రి కపిలేశ్వరపురం మండలం తాతపూడి, కపిలేశ్వరపురం గ్రామాల్లోని ఇసుక నిల్వల తరలింపునకు ప్రయత్నించారు. కపిలేశ్వరపురంలో రాత్రి వేళ ఇసుకను భారీ వాహనాల్లో తరలించారు. ప్రజలు ప్రతిఘటించడంతో తరలింపునకు అధికారులు అడ్డుకట్ట వేశారు. కొత్తపేట నియోజకవర్గం ఆత్రేయపురం మండలం పులిదిండిలో ఏకంగా సొంతంగా ర్యాంపునే ఏర్పాటు చేసి అక్రమాలకు పాల్పడ్డారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపారు. తూర్పుగోదావరి జిల్లా కడియం, పెరవలి, కొవ్వూరు, లాలాచెరువు ప్రాంతాల నుంచి ఇసుక తరలిపోయింది. పి.గన్నవరం మండలం ఎల్.గన్నవరం ర్యాంపు నుంచి ఇసుకను తరలించే ప్రయత్నం చేస్తుండగా, స్థానికుల సమాచారంతో అధికారులు అడ్డుకున్నారు. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ప్రాంతాల్లో సైతం అక్రమాలకు చోటుచేసుకున్నాయి.

భాగస్వామ్యమిచ్చి... ఆపై ముంచేసి

2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానంలో డ్వాక్రా మహిళలను భాగస్వాములను చేసింది. డ్వాక్రా మహిళలను అడ్డంపెట్టుకుని అక్రమాలకు పాల్పడింది. ర్యాంపుల నిర్వహణను మహిళలకే ఇచ్చానంటూ గొప్పలు చెప్పుకున్న చంద్రబాబు, తర్వాత డ్వాక్రా సంఘాలకు రావాల్సిన పావలా వాటాను ప్రభుత్వం నుంచి పొందేందుకు మహిళలు పెద్దఎత్తున ఉద్యమం చేయాల్సి వచ్చింది. పావలా వాటాను అడిగినందుకు 2015 జూలై 4న కోరుమిల్లి ఇసుక ర్యాంపులో డ్వాక్రా మహిళలపై లాఠీచార్జీ కూడా చేయించారు. సుమారు వంద మంది పోలీసులు మహిళలపై విరుచుకుపడటం రాష్ట్రంలో చర్చనీయాంశమైంది. ఇంతటి చరిత్ర ఉన్న నేపథ్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం చెబుతున్న ఉచిత ఇసుక పంపిణీ ఎలా జరుగుతుందో చెప్పకనే అర్థమవుతోంది.

ఊరంతా వచ్చి.. సారె ఇచ్చి



అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

పెరవలి: ఆషాఢం సారె ఇచ్చి పోలేరమ్మను ఊరంతా కొలిచింది. పెరవలి మండలం ఖండవల్లిలో పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి వారి స్తోమతకు తగ్గట్టు వివిధ రకాల పిండి వంటలు, పసుపు, కుంకుమతో మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి కానుకలు సమర్పించారు. మేళతాళాలు, భాజా భజంత్రీలతో ఊరేగింపుగా భక్తులు ఆలయానికి రావడంతో పండుగ వాతావరణం తలపించింది.



ఖండవల్లిలో పోలేరమ్మ తల్లి

అమ్మను చూసి.. మది మురిసి

- తలుపులమ్మకు గాజుల అలంకరణ
- దేవస్థానంలో భక్తుల రద్దీ

తుని రూరల్: తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆషాఢమాస శోభ వచ్చింది. ఈ మాసోత్సవాల్లో భాగంగా అమ్మవారిని మట్టి గాజులతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ఆషాఢమాసం తొలి ఆదివారం కావడంతో గర్భాలయంలో అమ్మవారిని వేదపండితులు, ప్రధాన అర్చకులు వివిధ రకాల గాజులతో అలంకరించారు. ఈ ఒక్కరోజే దేవస్థానాన్ని 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారని ఇన్‌చార్జ్ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. తేటగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులతో దేవస్థాన ప్రాంగణం కిక్కిరిసింది. కొండపైన అధిక సంఖ్యలో భక్తులు ఉండడంతో వేలాది మంది కొండ దిగువన మామిడి, జీడిమామిడి తోటల్లో వంటలు చేసుకుని, భోజనాలు ఆరగించారు. దేవస్థానంపై వసతి గదులు లభించని భక్తులు ప్రాంగణంలో చెట్ల కింద వంటలు చేసుకున్నారు. దేవస్థానం సమీపంలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద మందుబాబులు మద్యం క్యూ కట్టారు. ఇలా రెండు గంటలకు పైగా క్యూ కడుతూనే ఉన్నారు. తాళ్లూరు జంక్షన్‌లో పెద్ద సంఖ్యలో మద్యం ప్రియులు వాహనాలను రోడ్డుపై నిలిపివేసి మద్యం దుకాణానికి వెళ్లడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.



గాజుల అలంకరణలో తలుపులమ్మ తల్లి



లోవ ప్రాంగణంలో చెట్ల కింద వంటలు, భోజనాలు చేస్తున్న భక్తులు

రూ.9.61 లక్షల ఆదాయం

లోవ దేవస్థానానికి వివిధ విభాగాల ద్వారా రూ.9.61 లక్షల ఆదాయం లభించిందని ఈఓ విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.3,52,770, పూజా టికెట్లకు రూ.3,01,570, కేశఖండనశాలకు రూ.31,360, వాహన పూజలకు రూ.6,700, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలుగా రూ.1,03,022, విరాళాలుగా రూ.1,65,615 కలిపి మొత్తం రూ.9,61,037 ఆదాయం సమకూరిందని వివరించారు. గత ఏడాది ఆషాఢ మాసం తొలి ఆదివారం కంటే ఈసారి ఆదాయం రూ.2 లక్షలు అధికంగా వచ్చిందన్నారు.

భారీ బందోబస్తు

ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన వాహనాలను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు, దేవస్థానం ప్రైవేట్ సెక్యూరిటీతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తుని పట్టణ, రూరల్ సీఐలు గీతా రామకృష్ణ, ఎస్‌వీవీఎస్ మూర్తి, నలుగురు ఎస్సైలు, 130 మంది పోలీసులు, 25 మంది ప్రైవేట్ సెక్యూరిటీతో బందోబస్తు నిర్వహించారు. అదేవిధంగా 70 మంది శ్రీవారి సేవకులు, దేవస్థానం సిబ్బందితో ఆలయంలో, బయట భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

పుట్టపర్తి క్షేత్రాన్ని దర్శించుకోవాలి

- శ్రీసత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీసత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు

రాజమహేంద్రవరం రూరల్: పుట్టపర్తిలోని శ్రీసత్యసాయిని ప్రతి భక్తుడూ దర్శించుకోవడంలో పదాధికారులు కార్యోన్ముఖులు కావాలని శ్రీసత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. ఆదివారం రాజమహేంద్రవరం శ్రీసత్యసాయి గురుకులంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర, జిల్లా పదాధికారుల సమీక్ష ముగింపు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. దైవనామ సంకీర్తన, లిఖిత నామం, రథయాత్ర, ప్రశాంతి సేవలు, వ్యక్తిగత, సామాజిక సేవలు చేయడంలో ప్రతి ఒక్కరూ సమైక్యంగా కృషి చేయాలన్నారు. భగవాన్ శ్రీసత్యసాయిబాబా ఏర్పాటు చేసిన సంస్థల్లో పాల్గొనడం మన జన్మజన్మల అదృష్టమని, దీనిని భావితరాలకు ఆధ్యాత్మిక సంపదగా అందించాలన్నారు. వ్యక్తిగత, మానసిక పరివర్తన చెంది, ఆధ్యాత్మిక, ఆనందమయ జీవితం గడపడానికి నిరంతర సాధన చేయాలని సౌత్ జోన్ కోఆర్డినేటర్ ముకుందన్ అన్నారు. దైవనామ స్మరణతోనే ముక్తి మార్గాన్ని పొందవచ్చని రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల సమన్వయకర్త ఎం.ప్రకాశరావు తెలిపారు. వచ్చే నెల 2, 3, 4వ తేదీల్లో నిర్వహించే పుట్టపర్తి యాత్రను, త్వరలో జిల్లాలో జరిగే శ్రీసత్యసాయి రథయాత్రను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు కోరారు. అనంతరం ప్రేమ తరువు కార్యక్రమంలో భాగంగా గురుకులంలో మొక్కను నాటారు.

విద్యా, వైద్య, ఆధ్యాత్మిక, విపత్తుల సహాయ నిర్వహణ, వేదాధ్యయనం, గ్రామ సేవలు, విద్యాజ్యోతి, తదితర అంశాలపై ఆయా రాష్ట్ర సమన్వయకర్తలు వివరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్ర, రాష్ట్ర పదాధికారులు మధుసూదన్, మాధవి, భాస్కర్, కొమరగిరి శ్యామ్, కళ్యాణ్, స్నేహ, కుమారి, అరుణ, కమల, శ్రీదేవి, సురేష్, ఉమ్మడి గోదావరి జిల్లాల అధ్యక్షులు బులుసు వెంకటేశ్వర్లు, అడబాల కొండబాబు, యార్లగడ్డ గోవిందరాజులు, శ్రీసత్య సాయి గురుకులం కరస్పాండెంట్ అయోధ్యుల శ్యామసుందర్, ప్రిన్సిపాల్ కె. గురవయ్య పాల్గొన్నారు.

కావాలని ఒకరు.. వద్దని మరొకరు..

- మంత్రి, ఎమ్మెల్యే మధ్య సీఐ బదిలీ చిచ్చు



అమలాపురం టౌన్: అమలాపురం రూరల్ పోలీస్ సర్కిల్ సీఐ నియామకంపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుల మధ్య అభిప్రాయ భేదాలు వచ్చాయి. ఇవి చిచ్చు రేపుతున్నాయి. కూటమి కొత్త ప్రభుత్వం వచ్చాక శాఖల వారీగా అధికారులను బదిలీ చేయడం, బదిలీపై ఆయా స్థానాలకు వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్న అధికారులు ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకోవడం పరిపాటైంది. బదిలీలతో ఆయా నియోజకవర్గాల్లో కొలువు తీరేందుకు తొలుత స్థానిక ఎమ్మెల్యే సిఫార్సు లెటరు ఆ అధికారులకు అత్యవసరం. ఇప్పటికే కొందరు అధికారులు ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లెటర్లు పొంది తమ శాఖల ఉన్నతాధికారుల ప్రసన్నం కోసం మరో ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. అమలాపురం రూరల్ పోలీసు సర్కిల్ సీఐ స్థానాన్ని ప్రస్తుతం పి.గన్నవరం సర్కిల్ సీఐగా పని చేస్తున్న ప్రశాంత్‌కుమార్‌కు ఇవ్వాలని, ఆయనను బదిలీపై ఇక్కడకు రప్పించేందుకు ఎమ్మెల్యే ఆనందరావు సుముఖంగా ఉన్నారు. ఇదే సమయంలో కార్మిక మంత్రి సుభాష్ సీఐ ప్రశాంత్‌కుమార్ నియామకాన్ని వ్యతిరేకిస్తున్నారు. దీంతో మంత్రి, ఎమ్మెల్యే మధ్య సీఐ బదిలీ అంశం కొత్త సమస్యను తెచ్చి పెడుతోంది. అసలే మంత్రి, ఎమ్మెల్యే మధ్య కొంత దూరం ఉన్న తరుణంలో సీఐ బదిలీ అంశం మరింత నిప్పు రాజేస్తోంది. 2022లో జరిగిన అమలాపురం అల్లర్లలో కొంత మంది యువకులపై కేసులు నమోదైన సంగతి తెలిసిందే. ఈ అల్లర్లలో కొందరి యువకులను సీఐ ప్రశాంత్‌కుమార్ ఇబ్బంది పెట్టారన్నది మంత్రి సుభాష్ వాదన. గతంలో అల్లవరం ఎస్సైగానే కాకుండా ఓడలరేవు మెరైన్ సీఐగా, కోవిడ్ సమయంలో పట్టణంలో అదనపు సేవలు అందించిన ప్రశాంత్‌కుమార్‌కు అమలాపురం నియోజకవర్గంపై మంచి అవగాహన ఉంటుందన్న ఆలోచనతో ఆయనను రూరల్ సీఐగా నియమించాలనేది ఎమ్మెల్యే ఆనందరావు భావన. ఈ నేపథ్యంలో సీఐ బదిలీని ఒకరు స్వాగతిస్తుంటే, మరొకరు వ్యతిరేకిస్తున్నాయి. ఏమైనప్పటికీ సీఐ ప్రశాంత్‌కుమార్‌ను అమలాపురం రూరల్‌కు తీసుకురావాలన్న పట్టుదలతో ఎమ్మెల్యే ఉన్నట్లు సమాచారం. ఇదే సమయంలో మంత్రి సుభాష్ రూరల్ సీఐగా ప్రశాంత్‌కుమార్ నియామకం వద్దంటూ అందుకు గల కారణాలను డీజీపీ ద్వారకా తిరుమలరావును ఇటీవల కలిసి స్వయంగా వివరించినట్లు తెలిసింది.

ప్రసన్నం చేసుకుని ప్రయత్నాలు

అమలాపురం పట్టణ సీఐ పోస్టు కోసం ఎమ్మెల్యే వద్ద పలువురి సీఐలు అప్పుడే కర్చీఫ్ వేసి తమ తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇదిలా ఉంటే పి.గన్నవరం, ముమ్మిడివరం, రాజోలు, రావులపాలెం, రామచంద్రపురం, మండపేట పోలీసు సర్కిళ్లలో సీఐ పోస్టుల కోసం ఉమ్మడి జిల్లాలోని పలువురు సీఐలు మంత్రులు, ఎమ్మెల్యేల ప్రసన్నం కోసం ప్రయత్నిస్తున్నారు. అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం డీఎస్పీల బదిలీలు కూడా అనివార్యమయ్యే పరిస్థితుల్లో ఆయా స్థానాల్లో కొలువు తీరేందుకు రాష్ట్రంలోని పలువురి డీఎస్పీలు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జిల్లా ఏఎస్పీ పోస్టుకు గతంలో అమలాపురం డీఎస్పీగా పనిచేసిన ఓ అధికారి విశ్వ ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఇలా పలువురు అధికారులను బదిలీలతో తమ తమ నియోజకవర్గాలకు రప్పించేందుకు ఆయా ఎమ్మెల్యేలు ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చేసినట్లు తెలిసింది. ఆ దిశగానే తమకు అనుకూలమైన అధికారులకు సిఫార్సు లెటర్లు కూడా ఇచ్చేశారు. డీఎస్పీల బదిలీలు అందరి సమన్వయంతో జరగాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వంలో ఆ సమన్వయం కొరవడుతోందని తెలుస్తోంది.